క్లుప్తంగా

వేతనం అందక యాతన

ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులకు అందని వేతనాలు

పొన్నూరు: కూటమి ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుల పట్ల శీతకన్ను చూపుతోంది. పొన్నూరు మున్సిపాలిటీని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతున్న ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులకు రెండు నెలలు పూర్తవుతున్నా.. ఇంకా వేతనాలు అందలేదు. పట్టణ పరిధిలో మొత్తం 110 మంది ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. వారికి ఒక్కొక్కరికీ సుమారు రూ.21 వేలు జీతం ఉంది. సుమారు రూ.23 లక్షల వరకు జీతాలు రావాల్సి ఉంది. పలు కారణాలతో గత నెల జీతం అందించడంలో జాప్యం జరిగిందని.. జూలై 1వ తేదీన రెండు నెలల వేతనాలు జమ చేయనున్నట్లు మున్సిపల్ కార్యాలయం సిబ్బంది పేర్కొంటున్నారు.

కళాశాల ప్రాంగణంలో నిలిచిన మురుగు



చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు సెయింట్ మేరీస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మురుగు సమస్యతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.రఘువీర్ వద్ద ప్రస్తావించగా ఆయన నాయకులతో కలిసి గురువారం కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కళాశాల పరిసరాలలో మురుగు నీరు నిల్వ ఉండడంతో కళాశాలకు రాకపోకలు సాగించే విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు. కళాశాల, హస్టల్‌లోని మురుగు బయటకు వెళ్లే ప్రాంతంలో అడ్డుకట్ట వేయటంతో ప్రధాన ద్వారం ఎదురుగా మురుగు ఆగిపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రణీత్, అమర్నాథ్, డేవిడ్, కిరణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కాలేజీ అధ్యాపకురాలికి డాక్టరేట్



సురేఖ

గుంటూరు ఎడ్యుకేషన్: నల్లపాడులోని మద్ది బాలా త్రిపుర సుందరి (ఎంబీటీఎస్) ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ అధ్యాపకురాలుగా పనిచేస్తున్న నార్నే సురేఖకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. యూనివర్సిటీ పరిశోధన విభాగ డైరెక్టర్ ప్రొఫెసర్ కొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో 'ఆప్టిమైజేషన్ ఆఫ్ ప్రిన్సిపల్ డైమెన్షన్స్ ఆఫ్ ఏ రేడియల్ ఫ్లో గ్యాస్ టర్బైన్ రోటర్ యూజింగ్ జెనెటిక్ అల్గోరిథం అండ్ యాంట్ కాలనీ ఆప్టిమిగేషన్ అల్గోరిథం' అంశంపై చేసిన పరిశోధనకు ఆమెకు పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సురేఖను కళాశాల ప్రిన్సిపాల్ టి. శేఖర్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి వి.వి. కోటేశ్వరరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

రోల్‌బాల్ పోటీలకు నగర విద్యార్థుల ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి రోల్‌బాల్ పోటీలకు శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల రోల్‌బాల్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన ఎంపికలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి, వచ్చే నెలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. తమ పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో సైతం ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, ప్రైమరీ కో-ఆర్డినేటర్ దిల్ జహాన్ బేగం పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

పట్నంబజారు: భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసు స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ రహమాన్ తెలిపిన వివరాల ప్రకారం.. లాలాపేటలో నివాసం ఉండే షేక్ గౌస్ కుమార్తె సుమైఫిర్దోస్ (19)ను యానాది కాలనీ దుర్గానగర్‌కు చెందిన మెకానిక్ షేక్ బాజీతో 25 రోజుల కిందట వివాహం చేశారు. అప్పటి నుంచి బాజీ భార్యను వేధింపులకు గురి చేస్తున్నాడు. ఇద్దరి మధ్యా ఈనెల 25న వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపం చెందిన సుమై ఫిరోదోస్ వంటగదిలోని హుక్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి గౌస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చినుకు కురిసే వేళలో!



కోయవారిపాలెంలో ఎద్దులతో అరక దున్నుతున్న రైతన్న



తుమ్మలపాలెంలో పొలాల్లో విత్తనాలు నాటుతున్న మహిళలు

తొలకరి పలకరించింది.. వానలు కురుస్తున్నాయి. భూములు పదునెక్కుతున్నాయి. మూలకు చేరిన నాగలి కాడెద్దులకు జత కడుతుంది. హర్‌హర్ అంటూ రైతన్నలు జోడెద్దులను పొలాల బాట పట్టిస్తున్నారు. హలం మన్నును మీటుతోంది. ఈ యేడైనా మా పంట పండించు సామీ.. అంటూ కర్షకులు ఆకాశం వైపు ఆశగా చూస్తూ రెండు చేతులూ జోడిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ప్రత్తిపాడు మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు పొలంబాట పడుతున్నారు. పొలంలో సేంద్రియ ఎరువులు చల్లడం మొదలు.. భూములు దున్నడం, విత్తనాలు నాటడం, విత్తనాల కోసం కటింగ్ మిషన్ల వద్ద బారులు తీరడం కనిపిస్తోంది. రైతన్నలు ఏటా నష్టాలు మూటగట్టుకుంటున్నా మరలా కోటి ఆశలతో ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. – ప్రత్తిపాడు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్ సంధ్య, వైస్ ప్రిన్సిపాల్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రత్తిపాడు: యువత డ్రగ్స్ బారిన పడవద్దని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రె.టి. సంధ్య అన్నారు. గుంటూరు రూరల్ మండలం గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో గురువారం కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు 'సే నో డ్రగ్స్' అంటూ అవగాహన ర్యాలీ చేపట్టారు. వాల్ పోస్టర్లను ప్రదర్శించారు. యాంటీ డ్రగ్స్‌డే ప్రతిజ్ఞను చేశారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ సంధ్య కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎంవీఎస్ఆర్ షారూన్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఎంవీఎస్ ఐ.ఆదిలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ జి.బాలశౌరిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాకుమాను: మండలంలోని గ్రామాలను డ్రగ్స్ రహిత గ్రామాలుగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ-2 కె.విజయ్ భాస్కర్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ నిరోధక దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజయ్ భాస్కర్ మాట్లాడుతూ.. నేడు దేశ వ్యాప్తంగా యువత మాదక ద్రవ్యాల మత్తులో పడి తమ జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రాజశేఖర్, హెచ్ఎం, ఐసీడీఎస్ కాకుమాను సెక్టార్ సూపర్ వైజర్ వెంకాయమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొన్నూరు: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం పొన్నూరులోని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో డ్రగ్ ఫ్రీ ఇండియా పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్, న్యాయమూర్తి జి.రుక్మిణి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పారాలీగల్ వాలంటీర్లు, షేక్. ముజీబ్, జి.రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా ప్రత్తిపాడులో గురువారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు మాదక ద్రవ్యాలు, వాటి వినియోగానికి వ్యతిరేఖంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీ ప్యాట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



తనూజ భాగ్యశ్రీ



ఉమామహేశ్వరి

ప్రత్తిపాడు: జీప్యాట్-2025 పరీక్షా ఫలితాలలో చలపతి ఫార్మశీ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో పలు ర్యాంకులను సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు. స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. గత నెల 25వ తేదీన నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ అఖిల భారత స్థాయిలో జీప్యాట్ 2025 పరీక్షను నిర్వహించారని తెలిపారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు 8 మంది జాతీయ ర్యాంకులను సాధించారని అన్నారు. వారిలో జె.తనుజ భాగ్యశ్రీ 181వ ర్యాంకు.. ఎ.ఉమామహేశ్వరి 932వ ర్యాంకు.. సీహెచ్ వీరమోహన్ రెడ్డి 1384 ర్యాంకు.. వి.ఫణీంద్ర 2453 ర్యాంకు.. ఆర్.లక్ష్మీపతి 3897 ర్యాంకు.. ఆర్.బాలరాజు 4607 ర్యాంకు, ఎస్.చాందిని 5446 ర్యాంకు.. పి.వినయ్ కుమార్ 5694 ర్యాంకు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అభినందించారు.

మత్తులో పడితే జీవితాలు చిత్తు



చేబ్రోలు: తాత్కాలిక ఆనందం కోసం సరదాగా ప్రారంభమయ్యే మాదక ద్రవ్యాల వినియోగం క్రమంగా వ్యక్తులను బానిసలుగా మార్చేస్తుందని.. యువత వీటికి అలవాటు పడితే వారి బంగారు భవిష్యత్తు అంధకారంగా మారుతుందని చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి ఊర్మిళాదేవి అన్నారు. చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం ప్రపంచ పొగాకు మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎన్‌జీ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శైలజ, వైద్య సిబ్బంది, హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నో డ్రగ్స్ డేను గురువారం నిర్వహించారు. విద్యార్థులతో వాకథాన్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ వి.శ్రీదేవి మాట్లాడుతూ.. 'బ్రేక్ ది సైకిల్ ఇన్వెస్ట్ టూ ప్రివెన్షన్' అనే అంశాన్ని ఈ సంవత్సరపు థీమ్‌గా ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీనిధి రుణాలతో డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధి



మహిళలతో మాట్లాడుతున్న విజయలక్ష్మి, బీహార్ ప్రతినిధులు

పెదకాకాని: డ్వాక్రా సంఘాల మహిళలకు శ్రీనిధి బ్యాంక్ అందిస్తున్న రుణాలు ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. శ్రీనిధి ద్వారా రుణాలు తీసుకుని ఆ రుణాలను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి చెందుతున్న మహిళలు బీహార్ రాష్ట్ర ఆర్థికశాఖ ప్రతినిధుల బృందంతో పెదకాకానిలో సమావేశం ఏర్పాటు చేశారు. డ్వాక్రా మహిళలు శ్రీనిధి రుణాల సద్వినియోగం చేసుకునే విధానాన్ని పరిశీలించేందుకు గుంటూరు జిల్లాకు వచ్చిన బీహార్ రాష్ట్ర ఆర్థికశాఖ ప్రతినిధులు పుష్పేంద్రసింగ్ తివారీ, అశితోష్ కుమార్‌లు గురువారం పెదకాకాని చేరుకున్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. గతంలో రాష్ట్రంలో రూ.600 కోట్లతో ప్రారంభమైన శ్రీనిధి బ్యాంక్ ప్రస్తుతం రూ.6 వేల కోట్లకు టర్నోవర్‌కు చేరుకుందన్నారు. డ్వాక్రా సంఘాల్లోని మహిళలు శ్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి చెందుతున్న విధానాన్ని తెలుసుకునేందుకు బీహార ప్రభుత్వ బృందం పెదకాకానిలో పర్యటించిందన్నారు. కార్యక్రమంలో గుంటూరు శ్రీనిధి బ్యాంక్ డీజీఎం ధర్మేంద్ర, ఏజీఎం హర్షవర్ధన్, మేనేజర్ రాజా కుమార్, ఏపీఓ రాజు, మానిమేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రీ 5.0 విజన్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న బాబు

మేడికొండూరు: మండల సమీపంలోని విసదల అడ్డరోడ్డు వద్ద గల ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో ఇండస్ట్రీ 5.0 విజన్ అనే అంశంపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కంపెనీ సీనియర్ డైరెక్టర్ తురుమళ్ల బాబు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్స్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కలిపి అభివృద్ధి చేసినా, కొన్ని కోట్ల డయోట్స్ నిర్మించిన చిప్స్ ద్వారా అతి తక్కువ ఉద్యోగస్తులతో అత్యధిక అభివృద్ధి సాధించవచ్చునని వెల్లడించారు. ఏఐ, ఎంఐ ద్వారా అనేక ఆవిష్కరణలు సాధించి, నూతన ఆవిష్కరణకు నాంది పలుకవచ్చన్నారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ కోట శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఎంటెక్ పూర్తి చేసి ఒక గొప్ప చిప్ డిజైనింగ్ కంపెనీకి డైరెక్టర్‌గా ఎదగడం సంతోషదాయకమన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ పూర్ణ శేఖర్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరంగా విద్యార్థులు అందిపుచ్చుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు, ప్రిన్సిపాల్ డి.సంజయ్, ఏవో సీతారామయ్య, ప్రిన్సిపాల్ శ్రీహరి, వివిధ శాఖల అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధి తాడేపల్లి అంజిరెడ్డి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ కృష్ణా కెనాల్ డిపో మేనేజర్ కుబేర, మేనేజర్ క్యూసి వాగ్య మాట్లాడుతూ.. ఫోర్టిఫైడ్ రైస్‌పై ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని సూచించారు. బియ్యం, ఇతర ఆహార ధాన్యాలతో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ కలిపి సరఫరా చేయడం ద్వారా పోషక లోపాన్ని నివారించవచ్చవని కేంద్రం గుర్తించిందని వివరించారు. బియ్యానికి జింకు, ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 వంటి విటమిన్లు పోషకాలను కలిపిన కెర్నల్స్ మారుస్తారని అన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం గర్భిణులు, మహిళలు, పిల్లలు, బాలింతలు ఆహారంగా తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ కృష్ణ కెనాల్ డిపో సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని చినకాకాని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయాలపాలైన ఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ నుంచి గుంటూరు వెళుతున్న రెండు ద్విచక్రవాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో వాహనాలపై ప్రయాణిస్తున్న నలుగురు కింద పడడంతో గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు వారిని సమీప ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించారు.

చేనేత సమస్యలపై మంత్రి లోకేష్‌కు వినతి

తాడేపల్లి రూరల్: చేనేత సహకారం సంఘాలకు చెల్లించాల్సిన రూ.156 కోట్లను వెంటనే చెల్లించాలని కోరుతూ.. చేనేత సహకార సంఘాల నాయకులు గురువారం ఉండవల్లిలోని మంత్రి నారా లోకేష్ నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. చేనేత రంగం కార్పొరేట్ విధానాలతో సంక్షోభంలో చిక్కుకుందని అన్నారు. 2024-25 సంవత్సరంలో చేనేతకు నామమాత్రం కేటాయింపులు జరిగాయని మంత్రి నారా లోకేష్‌కు వివరించినట్లు తెలిపారు. నేతన్నలు పలు సమస్యలను వివరించగా సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నటుడు సత్యనారాయణకు కళాసేవా పురస్కారం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళా వేదికపై గురువారం జై భవానీ పూర్వ అధ్యక్షులు బీవీరావు 19వ వర్ధంతి సందర్భంగా కళాసేవా పురస్కార సభ నిర్వహించారు. బీవీరావు మెమోరియల్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి నటులు ఏంవీఎల్ నరసింహారావు అధ్యక్షత వహించారు. తొలుత ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, జై భవానీ నాట్య మండలి అధ్యక్షులు ఐతి వాసుదేవశర్మ, బి.శ్రీనివాస్, పురస్కార ప్రదాత వి.ఎస్.వి.ఎస్.రోహిత్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రసిద్ధ నటులు, గుణ నిర్ణేత పరిషత్ నిర్వాహకులు మానాపురం సత్యనారాయణను కళాసేవా పురస్కారంతో సత్కరించారు. అనంతరం కె. ఆదిత్య రచించి, కె.వి.మంగారావు దర్శకత్వం వహించిన 'మిణుగురు – వెలుగులు' నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆరె పాల్గొన్నారు.

నేడు అగతవరప్పాడులో వైఎస్సార్ సీపీ సమావేశం



అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అగతవరప్పాడు గ్రామంలో గ్రామ స్థాయి కమిటీ సమావేశం, నియోజక వర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశం జరుగుతుందని పొన్నూరు వైఎస్సార్ సీపీ కన్వీనర్ అంబటి మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పెదకాకాని మండలంలోని అగతవరప్పాడు ఆంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం సాయంత్రం 5 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి పొన్నూరు నియోజకవర్గానికి నూతనంగా నియమించిన వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

నిషేధిత కలుపు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు



పురుగు మందు డబ్బాలను పరిశీలిస్తున్న ఏఓ సుధాకర్



దుకాణాల్లో స్టాకును పరిశీలిస్తున్న ఏవో షేక్ సుగుణబేగం

కాకుమాను: ఎరువులు, పురుగు మందు దుకాణాలలో నిషేధిత కలుపు మందులు విక్రయిస్తే అటువంటి దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసు నమోదు చేస్తామని ఏఓ వి.సుధాకర్ హెచ్చరించారు. మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం కలుపు మందులను నిషేధించినట్లు, ముఖ్యంగా గ్లైఫోసినేట్ మందును పూర్తిగా నిషేధించినట్లు ఆయన తెలిపారు. దుకాణాలలో నిషేధిత పురుగు మందులు విక్రయించినా, కొనుగోలు చేసిన అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా దుకాణాలలో పురుగు మందులు, స్టాకు వివరాల రిజిష్టర్‌లను ఆయన పరిశీలించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో గురువారం మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణబేగం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాల్లో స్టాక్ రిజిష్టర్లు, సేల్ రిజిష్టర్లతో పాటు అందుబాటులో ఉన్న విత్తనాల ప్యాకెట్లు, వాటికి సంబంధించిన బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రిజిష్టర్లను పక్కాగా నిర్వహించాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో వారికి కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వెంట సిబ్బంది ఉన్నారు.

నిధుల లెక్కపై రగడ

గ్రాంట్ల వివరాలు, ఖర్చుల లెక్కలు చెప్పాలని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీల పట్టు



ఎంపీడీవోను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు

ప్రత్తిపాడు: మండల పరిషత్‌కు వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలు, వచ్చిన నిధుల్లో ఏ ఎంపీటీసీకి ఎంత నిధులు కేటాయించారన్న వివరాలను సభ సాక్షిగా చెప్పాలని కొందరు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. ప్రత్తిపాడులో గురువారం ఎంపీడీవో కె.శివపార్వతి ఆధ్వర్యంలో ఎంపీపీ దాసరి అన్నమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు వాసిమళ్ల మాణిక్యరావు, మదమంచి సురేష్, గురుగూరి చాముండేశ్వరి, మేరుగ సుభాషిణి, బూసి సువార్తమ్మలు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్ని నిధులు వచ్చాయి.. ఎంత ఖర్చు చేశారు.. ఏ గ్రామానికి, ఏ ఎంపీటీసీకి ఏ పనులకు ఎంత కేటాయించారు.. అదే విధంగా గత ప్రభుత్వంలో వచ్చిన నిధులు, జమా ఖర్చుల వివరాలను తెలియజేయాలని ఎంపీడీవోను కోరారు. ఇప్పటికీ రెండు సమావేశాల నుంచి నిధుల లెక్కలు అడుగుతున్నామని.. కానీ ఇవ్వడం లేదని మండిపడ్డారు. లెక్కలు చెప్పనప్పుడు, తీర్మానాల్లో ఏ అంశాలు పెడతారో తెలియనప్పుడు మేం సమావేశాలకు వచ్చి ఉపయోగం ఏమిటని ఎంపీడీవోను ప్రశ్నించారు.

ఒక్క గ్రాంటూ రాలేదు..

స్పందించిన ఎంపీడీవో శివపార్వతి నేను వచ్చిన దగ్గర నుంచి (గతేడాది అక్టోబరు) ఒక్క గ్రాంటు కూడా రాలేదని తెలిపారు. కేవలం ఎంపీటీసీల గౌరవ వేతనాలు రెండు సార్లు వచ్చాయని.. అవి కూడా బిల్లులు చేసి పంపితే రిటర్న్ వచ్చాయని తెలిపారు. అవి కాకుండా ఎయిట్ రూపీస్ ఫర్ క్యాపిటల్ నిధులు వచ్చాయని చెప్పారు. గత ప్రభుత్వంలో వచ్చిన నిధుల వివరాలను సమావేశం పూర్తయిన తరువాత ఇస్తానని ఎంపీడీవో తెలిపారు. శాంతించని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు లెక్కలు చెప్పనప్పుడు సర్వసభ్య సమావేశానికి సహకరించలేమని చెబుతూ సమావేశ మందిరం నుంచి వాకౌట్ చేసి బయటకు వచ్చేశారు. అనంతరం ఎంపీడీవో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఎంపీటీసీలు ఏ పనులు చేయాలనుకుంటున్నారో చెబితే ఇదే సమావేశంలో తీర్మానం చేస్తామని చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపీపీ షేక్ అఫ్రినా సుల్తానా, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.


యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



అశోక్ కుమార్, రమేష్‌తో యోగా శిక్షణార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: సనాతన రుషి సంస్కృతి వారసత్వంగా ఉన్న యోగా అభ్యాసం ద్వారా మానసిక, శారీరక దృఢత్వం అలవడి సంపూర్ణ ఆయుష్షును పొందవచ్చని గీతా మందిరం మాజీ చైర్మన్ రాయవరపు అశోక్ కుమార్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర యోగా కేంద్ర ఆధ్వర్యంలో ఆర్ అగ్రహారంలోని గీతా మందిరంలో 136వ యోగా శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అశోక్ కుమార్ మాట్లాడుతూ పదేళ్ల కిందట ప్రధాని నరేంద్ర మోదీ యోగాను విశ్వవ్యాప్తం చేశారని తెలిపారు. నేడు 195 దేశాలకు పైగా యోగా సాధన చేయడం ద్వారా ప్రపంచం శాంతి వైపు పయనిస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదని పేర్కొన్నారు. యోగా శిక్షకుడు బెల్లంకొండ రమేష్ మాట్లాడుతూ తమ గురువు వేంకటేశ్వరరావు శిష్య పరంపరలో ఒకడిగా గత రెండు దశాబ్దాలుగా 15 వేల మందికి పైగా ఉచితంగా యోగా శిక్షణ అందించామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల స్థాయిలో యోగా సాధనకు ప్రత్యేకంగా శ్రద్ధ కనపరచడం మంచి విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలకుంట వీరయ్య, మేడూరి రాజేంద్రప్రసాద్, గాదెంశెట్టి సురేష్ కుమార్, అచ్యుత ప్రసాద్, వంకా రాధాకృష్ణమూర్తి, కొమ్మూరి బాపనయ్య, మోటుమర్రి రమేష్ బాబు, చామర్తి లక్ష్మీపార్వతి రాజారావు, జి. ప్రియాంక పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

తాడేపల్లి రూరల్: తాడేపల్లి డ్రైవర్స్ కాలనీ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం మలేరియా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మానస మంజరి మాట్లాడుతూ.. ప్రస్తుతం మలేరియా, చికెన్ గున్యా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా శ్రద్ధ తీసుకోవడంతో పాటు నీటి తొట్లు, ట్యాంకులు అన్నింటినీ వారంలో ఒక రోజు శుభ్రం చేసుకోవాలని వివరించారు. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రక్తపరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబడి, తాడేపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి సుధీర్, హెచ్‌వీ శ్రీలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ జయరాజు, ల్యాబ్ టెక్నీషియన్ రామోజీ, ఎన్ఎస్ఎమ్‌లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.